సమాచారం

నార్సింగి పోలీసులకు అవార్డులు

మణికొండ: పలు కేసుల ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నార్సింగి పోలీసులు అవార్డులు అందుకున్నారు. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా వారు అవార్డులను అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుళ్లు రవీందర్, బుచ్చయ్య ఉన్నారని, వారిని నార్సింగి ఇన్‌స్పెక్టర్ వి.శివకుమార్ ప్రత్యేకంగా అభినందించారని అడ్మిన్ ఎస్ఐ బాలరాజు తెలిపారు.

క్రీడా పోటీలకు రావాలని ఎంపీకి ఆహ్వానం



ఎంపీ రంజిత్‌రెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

రాజేంద్రనగర్: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధారుడ్యం కలుగుతాయని ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలకు హాజరుకావాలని కోరుతూ ఆయనకు నిర్వాహకులు వినతిపత్రం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో జ్యోతి, నయీం, మంగళారం నాగభూషణం, అక్కిరాజు సుబ్బారావు, వినాయక ప్రీతం, వీర్లపల్లి మహేష్, వీర్లపల్లి నవీన్, గ్యార రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

914 మందికి కంటి పరీక్షలు



కంటి వెలుగు కేంద్రంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందగా పాల్గొని పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్‌లలో ఐదు కంటి వెలుగు కేంద్రాలను కొనసాగిస్తున్నారు. మంగళవారం 914 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. రీడింగ్ గ్లాసెస్ 312, ప్రిస్కిప్షన్ గ్లాసెస్ 178 మందికి అందజేశారు.

బీసీల సంక్షేమానికి నిధులు కేటాయించాలని వినతి



బీసీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఓబీసీఎస్ఏ ప్రతినిధులు

రాయదుర్గం: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల అభివృద్ధి, సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులకు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఓబీసీఎస్ఏ) బృందం మంగళవారం వినతిపత్రం అందజేసింది. బీసీ కమిషన్ కార్యాలయంలో వారు అధికారులను కలిశారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.శివకుమార్ మాట్లాడుతూ.. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. బీసీలకు ప్రత్యేక సబ్సిడీలతో కూడిన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీసీ విద్యార్థులకు హాస్టల్, మెస్ ఫీజు రూ.1,500 నుంచి మూడు వేలకు పెంచాలని, కొత్తగా బీసీ కళాశాలలు, ఇంజనీరింగ్ కాలేజీలు, మహిళలకు ప్రత్యేకంగా కళాశాలలను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలపై జరుగుతున్న దాడులను నివారించడానికి ప్రత్యేక చట్టం చేయాలని ఆయన అన్నారు.

నేడు హెచ్‌సీయూలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో బుధవారం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ ఎంగేజింగ్ యంగ్ మైండ్స్ కార్యక్రమంలో భాగంగా 'జీ–20 అండ్ రోల్ ఆఫ్ ఇండియన్ ప్రెసిడెన్సీ' అనే అంశంపై యూఎన్‌లో మాజీ భారత శాశ్వత ప్రతినిధి, హైదరాబాద్ కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు హెచ్‌సీయూ క్యాంపస్‌లోని జాకిర్ హుస్సేన్ లెక్చర్‌హాల్ కాంప్లెక్స్‌లో ఈ ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తారు.

ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఆనంద్‌నగర్ పార్కు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3.96 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆనంద్‌నగర్ కాలనీలో రూ.18 లక్షలతో పార్కు, రూ.3.78 కోట్లతో అభ్యుదయ నగర్, సాయిబాబానగర్, మైత్రి కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌ల పరిధిలోని కాలనీలు, బస్తీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్ని మండలాల్లో సమస్యలు లేకుండా చేసి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సుపరిపాలన అందిస్తున్నామని, మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను 98 శాతం పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నామని ఆయన అన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో కేసీఆర్ కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేణుగోపాల్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, శ్రీలతాసురేష్‌గౌడ్, నిఖిలాసంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జేపీ దర్గా వద్ద ఎమ్మెల్యేను సన్మానించిన కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్

దర్గాలో ప్రార్థనలు..

శంషాబాద్: ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమైక్యతను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, 4వ వార్డు కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ మంగళవారం జేపీ దర్గాలో చేపట్టిన న్యాజ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, సీనియర్ నాయకుడు ఆర్.గణేష్‌గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, కౌన్సిలర్లు అజయ్, వై.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు విశేష స్పందన

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగుకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ అభ్యుదయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య పరీక్షలకు వచ్చే ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

వైభవంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఊరేగింపుగా దేవాలయానికి వస్తున్న గ్రామస్తులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న మల్లన్న ఉత్సవాలలో భాగంగా చివరి రోజు మంగళవారం రేణుక ఎల్లమ్మ కల్యాణం, బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఉదయం గ్రామం నుంచి ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ దేవాలయ నిర్వాహణ కర్త, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించండి

శంషాబాద్: పెండింగ్ ఫీజులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఫీజు బకాయిలతో విద్యార్థుల చదువులు అగమ్యగోచరంగా మారుతున్నాయని ఏబీవీపీ నాయకులు అన్నారు. విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5,500 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఏబీవీపీ నాయకులు కళ్లెం సూర్యప్రకాష్, మనీష్, అఖిల్, భార్గవి, అఖిలాండేశ్వరి, తిరుపతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

మరణం లేని చిరంజీవి మార్కండేయుడు



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: సృష్టికర్త బ్రహ్మ, లయ కారకుడు పరమశివుడితో పాటు సప్తరుషుల దీవెనలతో 16 ఏళ్ల అల్ప ఆయుష్మడిగా జన్మించిన మార్కండేయ స్వామి మృత్యువు లేని చిరంజీవి అయ్యారని రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉస్కెమూరి నిరంజన్ అన్నారు. చిరుప్రాయం నుంచే అపారమైన శివ భక్తే భక్త మార్కండేయుడిని మృత్యువు దరిచేరకుండా చేసిందన్నారు. మంగళవారం మార్కండేయ స్వామి జయంతిని పురస్కరించుకొని కాటేదాన్ మార్కండేయ ట్రస్ట్ భవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్త మార్కండేయుడి వంశీయులుగా పద్మశాలీలు ప్రపంచ వ్యాప్తంగా మానవాళి మానరక్షణకు వస్త్రాలు సిద్ధం చేసి ఇవ్వడంలో సిద్ధహస్తులని చెప్పారు. యాంత్రీకరణతో పద్మశాలి చేనేతకు ఆదరణ తగ్గుతూ వస్తుందని, మానవుల మాన రక్షణలో పద్మశాలీయుల సేవలు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి ట్రస్ట్ భవన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాశిగారి యాదగిరి, వైస్ చైర్మన్లు ఉస్కెమూరి విజయ్‌కుమార్, మునగపాటి విష్ణు, బాస శ్రీనివాస్, ఉస్కెమూరి శ్రీనివాస్, పులిజాల వివేకానంద, బండారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరణ

రాజేంద్రనగర్: అత్తాపూర్ మహారాణా ప్రతాప్ సేవా సమితి నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం సమితి సభ్యులు ఆవిష్కరించారు. రాంబాగ్‌లోని రామ మందిర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. విజయ్, దినేష్‌సింగ్, మనోజ్‌సింగ్, జీవన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తులకు పోలీసుల కౌన్సెలింగ్

మియాపూర్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలను అరికట్టేందుకు పాత నేరస్తులు, అనుమానితులతో మియాపూర్ పోలీసులు మంగళవారం కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావు, డీఐ కాంతారెడ్డి, ఎస్ఐ యాదగిరిరావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఆటోల దొంగతనాలు, హత్య కేసులు తదితర క్రిమినల్ కేసుల్లో వారి ప్రమేయం ఉండకూడదని హెచ్చరించారు. మరోసారి నేరం రుజువైతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏ సమయంలోనైనా స్పందించాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతుంటామని తెలిపారు. అనంతరం ఏఏ పనులు, ఎక్కడెక్కడ నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు పిలిచినా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పీవీబీ వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీఎన్‌జీఓ కాలనీ ఫేజ్–1, ఫేజ్–2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మాదాపూర్: అనుమతులు లేకుండా భవనాలు, షెడ్‌లను నిర్మిస్తే ఉపేక్షించేది లేదని చందానగర్ టీపీఎస్ మధు హెచ్చరించారు. మాదాపూర్‌లో మంగళవారం సిబ్బందితో కలిసి అక్రమంగా నిర్మిస్తున్న భవనాల పిల్లర్లను, షెడ్‌లను కూల్చివేశారు. ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే ఆ నిర్మాణాలను కూల్చివేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

హెచ్‌సీయూలో ప్రశాంత వాతావరణం ఉంది

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, క్యాంపస్ ప్రశాంతంగా ఉందని హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21న ఎలాంటి అనుమతి లేకుండా 'ఇండియా: ది మోడీ క్వశ్చన్' అనే డాక్యుమెంటరీని ప్రదర్శించారు. సమాచారం అందుకున్న భద్రతా బృందం, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ వేదిక వద్దకు చేరుకొని డాక్యుమెంటరీ ప్రదర్శన నిలిపివేయాలని నిర్వాహకులకు సూచించారు. అయితే నిర్వాహకులు అందుకు అంగీకరించకుండా కొంతమంది విద్యార్థుల సమక్షంలో డాక్యుమెంటరీ ప్రదర్శన కొనసాగించారని పేర్కొన్నారు. క్యాంపస్‌లో ఈవెంట్ నిర్వాహించాలనుకునే విద్యార్థి సంస్థ డీన్ విద్యార్థుల సంక్షేమం ద్వారా ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమం శాంతియుతంగా ముగిసినప్పటికీ తదుపరి చర్యల కోసం ఈవెంట్‌పై నివేదిక అందజేయాలని విశ్వవిద్యాలయం కోరిందన్నారు.

రూ.10 కోట్ల స్కాలర్‌షిప్స్ అందించనున్న ఆర్వీయూ

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ విద్యా సంస్థ ఆర్వీ విశ్వవిద్యాలయం(ఆర్వీయూ) ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించే మెరిట్ స్కాలర్‌షిప్ కోసం రూ.10కోట్లు కేటాయించింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో మొదలయ్యే విద్యా సంవత్సరానికి గాను బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఏఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, లిబరల్ ఆర్ట్స్ అండ్ సైన్స్, లా తదితర కోర్సులకు చెందిన 500కు పైగా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ విద్యార్థులకు దీని ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు https://admissions.rvu.edu.inలో దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

పోలీసుల పనితీరుపై సీపీ స్టీఫెన్ రవీంద్ర సమీక్ష

శంషాబాద్: నేరాలకు పాల్పడిన దోషులకు కచ్చితంగా శిక్షపడేలా దర్యాప్తు చేపట్టడంతో పాటు సరైన ఆధారాలను న్యాయస్థానం ముందుంచాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం శంషాబాద్ జోన్ పోలీసుల పనితీరుపై డీసీపీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పోలీసింగ్‌ను మరింత పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రతి సెక్టార్ ఎస్ఐల పనితీరును తానే స్వయంగా సమీక్షిస్తానని, నేరాల తీవ్రత తగ్గేలా స్టేషన్ హౌస్ అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. 2023లో నేరాల నియంత్రణపై లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును మరింత పెంచాలని, క్షేత్ర స్థాయిలో పోలీసుల పనితీరుతోనే నేరాలు తగ్గుముఖం పడతాయని ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. సమావేశంలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్, క్రైమ్ డీసీపీ కల్మేశ్వర్, శంషాబాద్ జోన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, అడ్మిన్ డీసీపీ ఇందిర, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఏజీవర్సిటీ: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్ అన్నారు. మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, రోటరీ ఇంటర్నేషనల్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. కేన్సర్‌పై విద్యార్థులకు, సిబ్బందికి వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 175 మందికి కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ జెల్లా సత్యనారాయణ, అసోసియేట్ డీన్ డాక్టర్ నరేంద్ర రెడ్డి, ఇన్‌చార్జి మెడికల్ అధికారి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, అధికారులు

సస్పెన్షన్‌కు గురైన నెక్నాంపూర్ కౌన్సిలర్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ 7వ వార్డు కౌన్సిలర్ బి.పద్మారావు మరోసారి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇటీవల వార్డు పరిధిలో ఇల్లు నిర్మించుకుంటున్న ఓ అధికారిపై ఆయన బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సదరు వ్యక్తి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ ఈ విషయంలో వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసు జారీ చేశారు. అయితే ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

అక్రమాలను ప్రశ్నిస్తాననే...

మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలు, నిధుల వినియోగంపై తరచూ ప్రశ్నించడం, రాబోయే అవిశ్వాస తీర్మాణంలో వ్యతిరేకంగా ఓటు వేస్తాననే భయంతోనే తనపై పథకం ప్రకారం పోలీసు కేసు నమోదు చేయించారని కౌన్సిలర్ పద్మారావు ఆరోపించారు. అందులో భాగంగానే కలెక్టర్‌కు తప్పుడు నివేదిక పంపించారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీలో అక్రమాలను బయటకు తీసుకొచ్చి తీరతానని ఆయన అన్నారు.

'బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం'

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్రంలో అవినీతికి పాల్పడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వం దేశ ప్రజలను మోసగించేందుకు బీఆర్ఎస్ పేరుతో వస్తుందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. చేవెళ్ల పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో చేవెళ్ల కోర్ కమిటీ, అసెంబ్లీ కోర్ కమిటీ సమావేశంలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తన కార్యాలయంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తామే చేస్తున్నామని బీఆర్ఎస్ నేతలు గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.



ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీని సందర్శించిన విద్యార్థులు



ఏజీవర్సిటీ: సికింద్రాబాద్ లయోలా అకాడమీ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. ఐసీఏఆర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్, నూనె గింజల పరిశోధన కేంద్రాన్ని విద్యార్థులు పరిశీలించారు.

నార్సింగి టీపీఓగా మళ్లీ శ్రీధర్‌గౌడ్

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: టౌన్‌ప్లానింగ్ అధికారిని తొలగించడం, కొత్తగా వచ్చిన అధికారిని రెండు రోజుల్లోనే తప్పించడంపై 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో గత కొంత కాలంగా శ్రీధర్‌గౌడ్ పనిచేస్తున్నారు. వారం రోజుల క్రితం ఎలాంటి కారణం లేకుండానే అతడిని తప్పించి సంతోష్‌సింగ్‌ను నియమించారు. ఆయన వచ్చిన వెంటనే గొలిదొడ్డిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారు. దీంతో సంతోష్‌సింగ్‌ను మరుసటి రోజు విధుల నుంచి తప్పించారు. హైదరాబాద్ నగర శివారులోనే అతిపెద్ద మున్సిపాలిటీ అయిన నార్సింగికి టీపీఓ లేకపోవడం ఇబ్బందిగా మారిందనే విషయం రెండు రోజుల క్రితం 'సాక్షి' ప్రచురించింది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లే కమిషనర్‌కు లేఖ అందజేశారు. అయితే వాటిపై చర్యలు తీసుకునే అధికారి లేని స్థితిని కథనంలో వివరించడంతో అధికారులు వెంటనే స్పందించి తిరిగి శ్రీధర్‌గౌడ్‌ను నియమిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన బుధవారం విధుల్లో చేరతారని కమిషనర్ సి.సత్యబాబు తెలిపారు.

ఆలయాల సందర్శనతో మనశ్శాంతి

మణికొండ: ధర్మం గురించి తెలుసుకునేందుకు ప్రజలు ప్రతిరోజూ దేవాలయాలకు రావాలని పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకర భారతి స్వామి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీలో నూతనంగా నిర్మించిన మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర నవగ్రహ సహిత లలితా పరమేశ్వరీ సమేత కామేశ్వరస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించిన మాట్లాడారు. ఆలయాల్లోనే మనకు జ్ఞానబోధ, మనశ్శాంతి, ధర్మత్వం లభిస్తుందని, సాధ్యమైనంత ఎక్కువ సార్లు ఆలయాలను దర్శించాలని ఆయన సూచించారు. విగ్రహారాధనతోనే మనకు నిగ్రహ శక్తి వస్తుందని, ప్రతి దాంట్లో ఓ శక్తి ఉంటుందని, దాన్ని మనలో ప్రవేశింపచేసుకున్నపుడే సన్మార్గంలో పయనిస్తామని చెప్పారు.



వేడుకలకు హాజరైన విద్యా శంకర భారతి స్వామి